# సూర్య

నేటి దినపత్రిక

18వ వసంతంలోకి

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం | 06 నవంబర్ 2024 | పేజీలు 8


## సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయాలి

### జిల్లా కలెక్టర్ ఆనంద్



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** జిల్లాలో అన్ని రకాల సహకార సంఘాలను పటిష్ట పరచి వాటి బలోపేతానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రజలకు మంచి సేవలు అందించుటకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. మంగళవారం ఉదయం నెల్లూరు కలెక్టరేట్లోని ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నాల్గవ జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రైవేటు బ్యాంకుల తరహాలో రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు జిల్లాలో సహకార సంఘాల ఆధునీకరణ, డిజిటలైజేషన్‌కు అన్ని చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఆప్కాబ్ సహకారంతో జిల్లాలోని 78 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలోని రికార్డులు కంప్యూటరీకరణ పూర్తి దశకు వచ్చిందన్నారు.

-మిగతా 2లో

### టీడీపీ సభ్యత్వ నమోదులో ఏపీలో ఆత్మకూరును

## ప్రథమ స్థానంలో నిలపాలి

### మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :**

తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే ఆత్మకూరు నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. నెల్లూరు నగరంలోని క్యాంపు కార్యాలయంలో పార్టీ సభ్యత్వ నమోదుపై మండల కన్వీనర్లు, నాయకులు, బూత్ ఏజెంట్ల సమావేశంలో మంత్రి ప్రసంగిస్తూ.. దిశానిర్దేశం చేశారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదుపై పార్టీ నేతలు, కార్యకర్తలు అందరూ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. సభ్యత్వ నమోదుకు సంబంధించి రాష్ట్రంలో 10 నియోజకవర్గాలను మోడల్ నియోజకవర్గాలుగా పార్టీ ఎంపిక చేయగా ఇప్పటివరకు కళ్యాణదుర్గం మొదటి స్థానం, ఆత్మకూరు రెండో స్థానంలో నిలిచాయని మంత్రి ఆనం పేర్కొన్నారు. నెల్లూరు పార్లమెంటు పరిధిలోని 7 నియోజకవర్గాల్లో ఆత్మకూరు ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలో ఆత్మకూరును మొదటి స్థానానికి చేరుకునేలా పార్టీ క్యాడరంతా సభ్యత్వ నమోదును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని మంత్రి ఆనం కోరారు. నియోజకవర్గంలో 1.20 లక్షల మందిని సభ్యులుగా చేర్చేందుకు లక్ష్యంగా నిర్ణయించామని, ప్రతి బూత్‌లో కూడా సుమారు 70 శాతం ఓటర్లను పార్టీ సభ్యులుగా నమోదు చేసి లక్ష్యాన్ని అధిగమించేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు.



సభ్యత్వం పొందిన ప్రతి ఒక్కరికి పార్టీ అండగా ఉంటుందని, ఐదు లక్షల వరకు బీమా సౌకర్యం కల్పిస్తూ.. వారి సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని

-మిగతా 2లో

### కూటమి పార్టీల మధ్య

## ఎలాంటి కుమ్ములాటలు లేవు

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కలిసి పని చేసి విజయం సాధిస్తాం
- జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తాం
- జగన్.. అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశాడు
- ఖజానా ఖాళీ అయినా.. ఎన్నికల హామీలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నాం
- పెండింగ్ మున్సిపాలిటీలకు త్వరలో ఎన్నికలు నిర్వహించేలా చర్యలు
- మంత్రి పొంగూరు నారాయణ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

కూటమి పార్టీల నేతల మధ్య ఎలాంటి కుమ్ములాటలు లేవని స్పష్టం చేశారు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. మంగళవారం జిల్లా ఇన్చార్జి మంత్రిగా నియమించిన తర్వాత మొదటిసారి కాకినాడ జిల్లాకు వచ్చారు. మంత్రి నారాయణ జిల్లా ముఖ్య కేంద్రం కాకినాడకు వచ్చిన మంత్రికి కూటమి పార్టీల నేతలు ఘన స్వాగతం పలికారు. టీడీపీ పోలీస్ బ్యూరో సభ్యులు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మంత్రికి సాదర స్వాగతం పలికారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, పత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ,బీజేపీ, జనసేన జిల్లా అధ్యక్షులు, ఇతర నియోజకవర్గాల కూటమి పార్టీల ఇన్చార్జులు మంత్రి వంగూరు నారాయణకు స్వాగతం పలికారు. జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున అధికారిక కార్యక్రమాలు, సమీక్షలు కాకుండా కేవలం పార్టీ కార్యక్రమాలకే పరిమితమయ్యారు. కాకినాడలోని జిల్లా పార్టీ కార్యాలయంలో కూటమి పార్టీల సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లాలో ఉన్న రాజకీయ

-మిగతా 2లో

## కాకాణి హౌస్ అరెస్ట్

- పరిస్థితి ఉద్రిక్తతం
- సోమిరెడ్డి అవినీతి చేస్తే.. చూస్తూ ఊరుకోవాలా !
- మాజీ మంత్రి కాకాణి విమర్శ

2లో



### అందరి సహకారంతో

## నగరాన్ని అభివృద్ధి పథంలోకి నడుపుతాం

### కౌన్సిల్ సమావేశంలో మేయర్ పొట్లూరి స్రవంతి

- నెల్లూరు నగర సమస్యలపై గళం విప్పిన ఎమ్మెల్సీ పర్వత రెడ్డి
- సమస్యలను తెలియజేసిన కోఆప్షన్ సభ్యులు షేక్ వహీదా
- 6వ డివిజన్ సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ మద్దినేని మస్తానమ్మ విన్నపం

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :**

జిల్లాకు చెందిన అందరు ప్రజా ప్రతినిధుల సహకారంతో.. నెల్లూరు నగరపాలక సంస్థ అన్ని విభాగాల అధికారుల పర్యవేక్షణలో నగరాన్ని అభివృద్ధి పథంలోకి నడిపిస్తామని నెల్లూరు నగర కార్పొరేషన్ మేయర్ పొట్లూరి స్రవంతి పేర్కొన్నారు. నగర పాలక సంస్థ సాధారణ సర్వ సభ్య సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. మేయర్ స్రవంతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నగర పాలక సంస్థ అన్ని డివిజన్ల కౌన్సిల్ సభ్యుల సమక్షంలో ప్రవేశపెట్టిన 73 తీర్మానాలను అజెండాగా ప్రకటించగా.. 64 తీర్మానాలను కౌన్సిల్

-మిగతా 2లో



# అందరి సహకారంతో నగరాన్ని అభివృద్ధి పథంలోకి నడుపుతాం

(మొదటి పేజీ తరువాయి)

ఆమోదించారు. అజెండాలో 4 తీర్మానాలను తదుపరి కౌన్సిల్ సమావేశానికి వాయిదా వేయగా, 5 తీర్మానాలను రివైజ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగర వ్యాప్తంగా పారిశుద్ధ్య నిర్వహణ పనులు ప్రణాళికాబద్ధంగా జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటున్నామని తెలిపారు. కార్పొరేషన్ కమిషనర్ అన్ని విభాగాల అధికారులు, సిబ్బందితో పాటు నగర ప్రజలందరి సహకారంతో నెల్లూరు నగర పాలక సంస్థ ఉన్నతి సాధించేలా సమన్వయంగా కృషి చేస్తామని మేయర్ ఆకాంక్షించారు.అనంతరం ప్రజా ప్రతినిధులు తమ డివిజన్ల పరిధిలో ప్రస్తావించిన పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైను కాలువల పూడికతీత, దోమల నిర్మూలన, కుక్కలు, పందులు, పశువుల నియంత్రణతో పాటు స్థానిక సమస్యలను, వివిధ అంశాలను పరిష్కరించేందుకు కార్పొరేషన్ అధికారులు పూర్తి స్థాయిలో కృషి చేయాలని మేయర్ ఆదేశించారు. సమావేశంలో ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి, నగర పాలక సంస్థ అన్ని డివిజనుల కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, కమిషనర్ సూర్యతేజ, నగర పాలక సంస్థ అన్ని విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### నెల్లూరు నగర సమస్యలపై గళం విప్పిన ఎమ్మెల్సీ పర్వత రెడ్డి



నెల్లూరు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం నగర మేయర్ పొట్లూరి స్రవంతి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశానికి వైసీపీ కార్పొరేటర్లు వేలూరు ఉమామహేష్, ఊటుకూరు నాగార్జున, కరీముల్లా, నీలి రాఘవరావు, కామాక్షి దేవి, జయలక్ష్మి, నేతాజీ వేదవతి సుబ్బారెడ్డితో కలిసి వైసీపీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్చార్జ్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిల్లో నగర నియోజకవర్గ పరిధిలోని అనేక సమస్యలపై ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి గట్టిగా గళం విప్పారు. సర్వేపల్లి కెనాల్, జాఫర్ సాహెబ్ కెనాల్‌కు సంబంధించి రివీట్‌మెంట్ పనులు ఇంకా కొంత పెండింగ్లో ఉన్నాయని, అవి పూర్తి చేసి అక్కడ గ్రీనరీ అభివృద్ధి చేయాలని కోరారు.


గత ప్రభుత్వంలో జాఫర్ సాహెబ్ కెనాల్ వద్ద వాకింగ్ ట్రాక్ నిర్మాణం, గ్రీనరీ అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించే ప్రయత్నం చేశామని తెలిపారు. కానీ ప్రస్తుతం అక్కడ వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులను పక్కనపెట్టి.. పసుపు కలర్ బంకులు ఏర్పాటు చేసి.. అధికార దుర్వినియోగంతో ప్రస్తుత ప్రభుత్వం ఆక్రమణలకు పాల్పడుతున్నారన్నారు. దీనికి నగర మేయర్, కమిషనర్ సమాధానం చెప్పాలన్నారు. అదేవిధంగా ఉదయం 6 గంటలకే జాతీయ రహదారుల నుంచి భారీ వాహనాలు నగరంలోకి ప్రవేశిస్తున్నాయని.. దీని వలన నగరవాసులు ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొంటున్నారని, వాటిని నిరోధించే దిశగా దృష్టి సారించాలని కోరారు. ప్రతి కార్పొరేటర్ వారి వారి డివిజన్ సమస్యలను పరిష్కార దిశగా తీసుకెళ్ళేందుకు.. కౌన్సిల్ సమావేశాలు తప్పనిసరి అని తెలిపారు. మున్సిపల్ కమిషనర్, నగర మేయర్ చొరవ తీసుకొని ప్రతి మూడు నెలలకు ఒకసారి కౌన్సిల్ సమావేశాలు తప్పనిసరిగా జరిగే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నెల్లూరు నగర నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలపై కార్పొరేటర్లతో కలిసి.. ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి నగర మేయర్ స్రవంతికి వినతి పత్రం అందజేశారు.

### సమస్యలను తెలియజేసిన కోఆప్షన్ సభ్యులు షేక్ వహీదా



నెల్లూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో కోఆప్షన్ సభ్యులు షేక్ వహిదా పలు సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్ల నుంచి మైనారిటీ గురుకుల పాఠశాల ఆటో నగర్ షెడ్లలో నడుస్తుందని, అక్కడ ముస్లిం పిల్లలే కాదు, ఎస్సీ, ఎస్టీ పిల్లలు కూడా చదువుకుంటున్నారన్నారు. ఆ భవనం ఎప్పుడు కూలి పోతుందోనన్న భయంతో పిల్లల తల్లిదండ్రులు ఆందోళన పడుతున్నారు. గత ప్రభుత్వంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఎన్నోసార్లు గత ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఇప్పుడు కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, అలాగే మంత్రి నారా లోకేష్ చొరవతో ఈ కొత్త ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో అక్కచేరువుపాడులో 2018లో ఆగిపోయిన ఆ భవన పనులను తాత్కాలికంగా రెడీ చేసి మైనారిటీ గురుకుల పాఠశాలను అక్కడకు మార్చడంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కీలకపాత్ర వహించారని ఈ సందర్భంగా వారికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్పొరేషన్ శానిటరీ వర్కర్ పసుమర్తి కృష్ణ పొదలకురు రోడ్డు జేవీఆర్ కాలనీ వద్ద డ్యూటీలో ఉండగా కారు గుద్ది చనిపోయారన్నారు. ఈ సంఘటన జరిగి సంవత్సరమైనా.. ఆ కుటుంబానికి ఎలాంటి లబ్ది జరగలేదన్నారు. వెంటనే ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. బుజబుజనెల్లూరులో ముస్లిం స్మశాన వాటికలో హ్యాండ్ బోర్ చెడిపోయి రెండేళ్లవుతోందని, అలాగే ఆ ప్రాంతమంతా కంపతో నిండిపోయి ఉందని, వెంటనే జంగిల్ క్లీరెన్సు చేయించాలని విజ్ఞప్తి చేశారు.

### 6వ డివిజన్ సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ మద్దినేని మస్తానమ్మ విన్నపం




నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమా వేశంలో నెల్లూరు నగర స్థానిక ఆరో డివిజన్ కార్పొరేటర్ మద్ది నేని మస్తానమ్మ ప్రధాన సమస్యలను కౌన్సిల్ సమావేశంలో తెలియజేశారు. ముఖ్యంగా కాలువ పూడికతీత, దోమల బెడద, ఆత్మకూర్ బస్టాండ్ మెయిన్ రోడ్ ప్రాంతంలో వీధి దీపాల సమస్య, శునకాల బెడద మంచినీటి సమస్య పలు సమస్యలను కౌన్సిల్ సమావేశంలో పరిష్కరించాలని కోరారు, మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ త్వరలోనే నెల్లూరు నగరాన్ని ఒక స్మార్ట్ సిటీగా ఒక హై టెక్నాలజీతో రూపొందిస్తున్నారని సీఎం చంద్రబాబు నాయుడు సుపరిపాలనతో పేద ప్రజలు తమ ఆనందాన్ని ఎంతో వ్యక్తపరుస్తున్నారని ఈ సందర్భంగా మద్దినేని మస్తానమ్మ తెలియజేశారు.

## టీడీపీ సభ్యత్వ నమోదులో ఏపీలో ఆత్మకూరును ప్రథమ స్థానంలో నిలపాలి

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి ఆనం తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, కోపరేటివ్ సొసైటీలకు నామినేటెడ్ పరిధిలో పదవులను త్వరలో భర్తీ చేస్తామన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి భవిష్యత్తులో అన్ని పదవుల్లోనూ ప్రాధాన్యత ఉంటుందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ప్రతి పంచాయతీలో కూడా రూ.10 కోట్లతో సిమెంట్ రోడ్లు మంజూరు చేశామని, ఆలయాల మరమ్మతులకు రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నామని, మండలానికి 50 గోకులాలను మంజూరు చేయించామని, రోడ్డు మరమ్మతు పనులు మొదలుపెట్టామని మంత్రి ఆనం పేర్కొన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన క్రమం తప్పకుండా సామాజిక పింఛన్లు, ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులతో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను జాప్యం లేకుండా పరుగులు పెట్టిస్తున్నామని ఆయన తెలిపారు. పార్టీ క్యాడర్ అంతా అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతూనే పార్టీ బలోపేతం కోసం సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కోరారు. సమావేశంలో ఆత్మకూరు మున్సిపల్, ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్ పేట, సంగం, మర్రిపాడు, చేజర్ల మండలాల టీడీపీ నాయకులు, కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయాలి

(మొదటి పేజీ తరువాయి)



పిఎసిఎస్‌ల కంప్యూటరీకరణ వలన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు, ఆన్‌లైన్ సేవలకు, కోర్ బ్యాంకింగ్ సేవలకు అనుసంధానించబడి సభ్యులకు సత్వర సేవలు అందుతాయన్నారు. ప్రస్తుతం జిల్లాలో నెల్లూరు డీసీసీ బ్యాంకు, ప్రకాశం జిల్లా డీసీసీ బ్యాంకునకు అనుసంధానించబడిన 61 పిఎసిఎస్ సంఘాలలో క్రియాశీలక సభ్యుల రుణాలు, డిపాజిట్లు, భూమి వివరాలు 87.99 శాతం కంప్యూటరీకరణ పూర్తి అయినట్లు చెప్పారు. ప్రపంచ వికేంద్రీకత ఆహార భద్రతా పథకం కింద పడుగుపాడు పిఎసిఎస్‌కు అతిపెద్ద ధాన్యం నిల్వ కేంద్రం మంజూరైనట్లు, ఈ కేంద్రం ద్వారా బహుళ ప్రయోజన సేవలు రైతులకు లభించనున్నట్లు కలెక్టర్ చెప్పారు. నాబార్డు సహకారంతో జిల్లాలో కొత్తగా బహుళ ప్రయోజన పిఎసిఎస్ సంఘాలు, మత్స్యకారుల సంఘాలు, పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలు స్థాపించుటకు జాయింట్ కలెక్టరు అధ్యక్షతన జాయింట్ వర్కింగ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లాలో సహకార సంఘాల బలోపేతానికి కమిటీ సభ్యులు కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా సహకారశాఖ అధికారి గుర్రప్ప, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, పశుసంవర్ధకశాఖ అధికారి రమేష్‌నాయక్, నాబార్డ్ ఏజీఎం తదితరులు పాల్గొన్నారు.

# కూటమి పార్టీల మధ్య ఎలాంటి కుమ్ములాటలు లేవు

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితులు, కూటమి పార్టీ నేతల మధ్య సమన్వయం, జిల్లాలో ఉన్న సమస్యలపై ఆయా పార్టీల నేతలతో చర్చించారు. త్వరలో జరిగే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు భయ గోదావరి జిల్లాల తరఫున కూటమి బలపరిచిన అభ్యర్థి రాజశేఖర్ గెలుపునకు కృషి చేయాలని పార్టీల నేతలకు దిశా నిర్దేశం చేశారు. తనకు కాకినాడ జిల్లా ఇన్చార్జి మంత్రిగా బాధ్యతలు అప్పగించినందుకు సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. ఆ తర్వాత పార్టీల ముఖ్య నేతలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాకినాడ జిల్లా కూటమి పార్టీల నేతల మొదటి సమన్వయ సమావేశం ద్వారా జిల్లాలో ఉన్న రాజకీయ పరిస్థితులపై తనకు ఒక అవగాహన వచ్చిందన్నారు. ఒక పార్టీలోనే అనేక భేధాభిప్రాయాలు వస్తున్నప్పుడు కూటమిలోని మూడు పార్టీల మధ్య చిన్న చిన్న భేదాభిప్రాయాలు రావడం సహజమేనన్నారు. జిల్లాలోని కూటమి పార్టీల మధ్య చాలా చిన్న సమస్యలు ఉన్నాయని, అందరం కూర్చుని మాట్లాడుకుని సమస్యలు పరిష్కరించుకుంటామని చెప్పారు. కూటమిపై నమ్మకంతో వైసీపీని ప్రజలు దారుణంగా ఓడించారని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ముందుకు వెళ్తామన్నారు. సీఎం ఆదేశాల ప్రకారం మూడు పార్టీలను సమన్వయం చేయడంతో పాటు జిల్లాలో ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఇన్చార్జి మంత్రిగా తాను కృషి చేస్తానన్నారు. ఎన్నికల కోడ్ ఉండటంతో అధికారులతో ఎలాంటి సమీక్షలు చేయలేదని, పార్టీలపైనే దృష్టి పెట్టానని చెప్పారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇన్చార్జులు తమ నియోజకవర్గ అభివృద్ధిపైనే ఎక్కువగా చర్చించారన్నారు. జగన్ రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి వెళ్ళిపోయాడని మంత్రి నారాయణ విమర్శించారు. ఏ ఒక్క వ్యవస్థను విడిచిపెట్టకుండా అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారన్నారు. 10 లక్షల కోట్లు అప్పు చేసి జగన్ పారిపోయినప్పటికీ, తన పాలన అనుభవంతో సీఎం చంద్రబాబు ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు మంత్రి నారాయణ చెప్పారు. అయితే పూర్తిస్థాయిలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడటానికి మరికొంత సమయం పడుతుందన్నారు. జగన్ నిర్వాకంతో కేంద్ర నిధులు కూడా రాలేదని ఆరోపించారు. మున్సిపాలిటీలతో పాటు పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన స్థానిక సంస్థల నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులను కూడా జగన్ పక్కదోవ పట్టించారని విమర్శించారు. స్థానిక సంస్థల నిధులు దారి మళ్లించడంతో పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేని పరిస్థితి వచ్చిందన్నారు. ప్రతినెలా మూడుసార్లు కాకినాడకు వచ్చి అన్ని సమస్యలు పరిష్కరిస్తానని మంత్రి చెప్పారు. ఒక్కోసారి ఒక్కో పార్టీ కార్యాలయంలో సమావేశాలు ఏర్పాటు చేస్తానన్నారు. అమరావతిపై సీఎం చంద్రబాబు పట్టుదలతో ముందుకు వెళ్తున్నారని, మూడేళ్లలో పనులు పూర్తి చేస్తామన్నారు. అమరావతిపై 2014లోనే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించామని, ఆ తర్వాత ఏపీ రాజధానిపై కేంద్రం కూడా పార్లమెంట్లో సమాధానం ఇచ్చిందని గుర్తు చేశారు. త్వరలో జరిగే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమీ పార్టీల అభ్యర్థి రాజశేఖర్‌ను గెలిపించేందుకు మూడు పార్టీల నాయకులు కృషి చేయాలని దిశా నిర్దేశం చేసినట్లు మంత్రి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటర్ల నమోదును వేగవంతం చేయాలని నిర్ణయించారు. కాకినాడతో సహా ఎన్నికల పెండింగ్ లో మున్సిపాలిటీలకు వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు.



# నెల్లూరులో వృద్ధురాలు దారుణ హత్య

**సూట్ కేస్‌లో కుక్కి శవాన్ని మాయం చేసేందుకు చెన్నైకు తరలింపు**

**మింజూరు రైల్వే స్టేషన్‌లో పోలీసులకు పట్టుబడ్డ తండ్రీ, కూతురు**

**నెల్లూరు పోలీసులకు సమాచారం**



**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరులో దారుణం చోటు చేసుకుంది. ఓ వృద్ధురాలని అతి కిరాతకంగా చంపి ఆమె మృతదేహాన్ని సూట్ కేస్‌లో కుక్కి శవాన్ని మాయం చేసేందుకు చెన్నై మీంజూరు రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అయితే అక్కడ పోలీసులకు అనుమానస్పదంగా కనిపించడంతో సూట్ కేస్‌ను తనిఖీ చేశారు. శవం ఉండడంతో నిందితులను అరెస్టు చేసి నెల్లూరు పోలీసులకు సమాచారం అందించారు. వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు కుక్కల గుంట ప్రాంతానికి చెందిన రమణమ్మ అనే వృద్ధురాలు సోమవారం ఉదయం కూరగాయలు కొనుగోలు చేసేందుకు బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు సాయంత్రం వరకు చుట్టుపక్కల వెతికిన జాడ తెలియక పోవడంతో సంతపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అదే క్రమంలో మంగళవారం తెల్లవారు జామున చెన్నైలోనే రైల్వే స్టేషన్‌లో అనుమానస్పదంగా తిరుగుతున్న సుబ్రహ్మణ్యం ఆయన కుమార్తె దివ్యలను రైల్వే పోలీసులు ప్రశ్నించగా ఈ దారుణం వెలుగు చూసింది. కుక్కల గుంట ప్రాంతానికి చెందిన సుబ్రహ్మణ్యం వృద్ధురాలు రమణమ్మ నగలపై కన్నేసాడు. సోమవారం ఉదయం కూరగాయలు తీసుకొని ఇంటికి వెళుతున్న రమణమ్మకు మాయమాటలు చెప్పి ఇంటికి తీసుకెళ్లాడు. అతని ఇంట్లోనే ఆమెను హత్య చేసి ఒంటిపై ఉన్న నగలను అపహరించాడు. శవాన్ని ట్రావెల్ బ్యాగులో కుక్కి కుమార్తె దివ్యతో కలిసి ఆ సూట్ కేస్ తో నెల్లూరు రైల్వే స్టేషన్ నుంచి చెన్నై రైలు ఎక్కాడు. చెన్నై మంజూరు రైల్వే స్టేషన్ లో జనాలు ఎక్కువ మంది లేకపోవడంతో అక్కడ రైలు దిగారు. సూట్ కేస్‌ను అక్కడే వదిలి తిరిగి నెల్లూరుకు చేరుకోవాలని ప్రయత్నించారు. అదే క్రమంలో అక్కడే ఉన్న రైల్వే పోలీసులకు అనుమానం వచ్చి వారిని ప్రశ్నించారు. పొంతన లేని సమాధానాలు చెప్పడంతో సూట్ కేసును తెరిచి చూడగా వృద్ధురాలి శవం కనిపించింది. తమదైన శైలిలో విచారణ చేయడంతో అసలు నిజం పోలీసులకు చెప్పారు. ఈ ఘటన విషయాన్ని చెన్నై పోలీసులు నెల్లూరు సంతపేట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని నెల్లూరుకు తరలించారు. అలాగే చెన్నైలోనే వృద్ధురాలు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సంతపేట సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

# తప్పులను సవరించుకోండి : ఇన్‌చార్జ్ తహసిల్దార్



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీ సర్వేలు ఏవైనా తప్పులు జరిగి ఉంటే ప్రస్తుత గ్రామసభలో వాటిని సవరించుకోవాలని ఇన్‌చార్జ్ తహసిల్దార్ స్ఫూర్తి కోరారు. మండలంలోని చౌక చర్ల గ్రామంలో మంగళవారం రెవెన్యూ గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ రెవిన్యూ పరమైన భూ రీ సర్వే అంశాలపై పరిష్కారం చేసేందుకు కృషి చేస్తామన్నారు. గతంలో సర్వేలో పొరపాట్లు జరిగి ఉంటే వీటిని సరి చేసుందుకు ప్రభుత్వం ద్వారా ఈ గ్రామ సభలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈగ్రామ సభలో అర్జీ ఇవ్వని వారు ఉంటే రెండు రోజుల్లో విడవలూరులో 8న జరగనున్న గ్రామ సభలో అర్జీలను ఇవ్వవచ్చున్నారు. రీ సర్వే ను అవసరం అయినపట్టాదారులు సకాలములో సద్వినియోగం చేసుకోవలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వినోద్, మండలం సర్వేయర్ బాషా, డిప్యూటీ తహసిల్దార్ విజయభాస్కర్, వీఆర్‌ఓ శ్రీనివాసులు, స్థానిక టీడీపీ నేతలు మాజీ సర్పంచ్ సమాధి శ్రీనివాసులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


## భవన మరమ్మత్తులకు ప్రతిపాదనలు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పాత ఎంపీడీవో కార్యాలయ భవన మరమ్మత్తులకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు పంచాయతీరాజ్ డీఈ మణికుమార్ పేర్కొన్నారు. మంగళవారం సిబ్బందితో కలిసి భవనాన్ని పరిశీలించి కొలతలు తీయించారు. భవనానికి సంబంధించిన కలప, తదితర సామాగ్రిని గుర్తించి రికార్డుల్లో నమోదు చేసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 15వ ఆర్థిక సంఘం నిధులతో భవనానికి మరమ్మత్తులు చేపడతామన్నారు. నిర్మాణానికి అవసరమైన ప్రతి పాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపడం జరుగు తుందన్నారు. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు షరీఫ్, వెంకటేష్ నరసింహ, శేషారెడ్డిలు పాల్గొన్నారు.

## పొగాకుకు ప్రత్యామ్యాయపంటల అవగాహన

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం కరటంపాడు, బోయల చిరువెళ్ల రైతుసేవాకేంద్రాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి కె.కిషోర్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించగా ఏడిఏ వి.దేవసేనమ్మ అతిధిగా హాజరయ్యారు. పొగాకు ఉత్పత్తుల వలన కలిగెడి అనర్ధాలను రైతులకు వివరించారు. ప్రభుత్వం పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా శనగ, కంది తదితర పంటలను ప్రోత్సహిస్తుందన్నారు. రైతులకు విత్తనాలను సబ్సిడితో అందజేస్తుందన్నారు. శనగయొక్క నూతన వంగడాలు, యాజమాన్యపద్ధతులు, దిగుబడి, గిట్టుబాటు ధరలు తదితరాల గురించి ఆమె వివరించారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కిషోర్‌బాబు, విఏఏలు షేక్ యస్థాని, శ్రావణి, రైతులు తదితరులు పాల్గొన్నారు.




## సైదాపురంలో నాగల చవితి వేడుకలు



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురంలో స్థానిక ప్రజలు కార్తీక మాసంలో వచ్చేటువంటి నాగల చవితిని ఘనంగా జరుపుకుంటున్న భక్తులు. నాగ పంచమి రోజు పొద్దున్నే స్నానం చేసి తడి వస్త్రాలతో పుట్ట దగ్గరికి వెళ్లి దారంతో పుట్ట చుట్టూ ప్రదక్షిణాలతో తమ కోర్కెలను తీర్చాలని చల్లగా చూడాలని పాలు పోసి గుడ్లను పుట్టలో వదులుతూ నైవేద్యాలతో ఆరాధన చేస్తూ వేడుకుంటూ తనదైన శైలిలో మొక్కులు తీర్చుకుంటున్నా భక్తులు.

## టీడీపీ జీవిత సభ్యత్వాన్ని తీసుకున్న పొట్లూరి



**కావలి, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ జీవితకాల సభ్యత్వాన్ని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ ఉపాధ్యక్షులు పొట్లూరి శ్రీనివాసులు మంగళవారం ముసునూరులో ఉన్న కావలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో లక్ష రూపాయలు చెల్లించి సభ్యత్వాన్ని పొందారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆ పత్రాన్ని అందుకున్నారు. అనంతరు ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, గుంటుపల్లి రాజ్ కుమార్ చౌదరి పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న నలిశెట్టి శ్రీధర్



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో పసుపులేటి పెద పెంచలయ్య ఇటీవల క్యాన్సర్ బారిన పడి అనారోగ్యంతో మరణించడం జరిగింది. నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్ ఆదేశాల మేరకు ఆత్మకూరు జనసేన పార్టీ సీనియర్ నాయకులు జెపి ప్రసాద్, లక్ష్మీ శెట్టి మాధమంగళవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి నలిశెట్టి శ్రీధర్ రూ. 7వేల రూపాయలు ఆర్థిక సాయం చేయడం జరిగింది.

## ప్రయాణికులకు బహుమతుల అందజేత



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ప్రయాణికుల ఆదరణ పొందేందుకు సీతారామపురం మార్గంలో తిరిగే బస్సుల్లో ఏర్పాటు చేసిన గిఫ్టు స్కీమ్‌లో భాగంగా విజేతలైన ప్రయాణికులకు మంగళవారం ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ మార్గంలో తిరిగే ప్రయాణికులు బస్సులో ఏర్పాటు చేసిన బాక్సులో టిక్కెట్లు వేయడం జరిగింది. ఆ టిక్కెట్లను లాటరీ ద్వారా తీయగా మహేంద్ర, నిఖితలు విజేతలుగా నిలవడంతో వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపో సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# నిత్యాన్నదాన కార్యక్రమాన్ని పరిశీలించిన జేవీవీ ప్రతినిధులు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత 19 నెలల నుంచి జరుగుతున్న నిత్య అన్నదాన కార్యక్రమాన్ని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ఆత్మకూరు డాక్టర్ కొండారెడ్డి వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ జి.సుధాకర్ రెడ్డి వారి సతీమణి డాక్టర్ అరుణ, ఆత్మకూరు పట్టణంలోని వారి మిత్ర బృందం జనవిజ్ఞాన వేదిక రైతు సంఘం నాయకులతో కలిసి మంగళవారం సందర్శించారు. కంచి పరమేశ్వర్ రెడ్డి సొంత నిధులతో ప్రతిరోజు సుమారు 800మందికి రోగులకు వారి సహాయకులకు వైద్యశాల సిబ్బందికి అన్నదానం జరపడం గొప్ప విషయమని ఇటువంటి కార్యక్రమాలు అన్నదాన సమాజం వంటి సంస్థలు జరుపుతున్నాయని వ్యక్తిగా ఇటువంటి మహత్తర కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయమని ఈ విధంగా వైద్యశాల ప్రాంగణంలో ఉచితంగా భోజనాన్ని అందించడం వలన వైద్యశాలకు వచ్చే రోగుల సంఖ్య పెరిగిందని ఈ విషయాన్ని స్వయంగా నేను గమనించానని డాక్టర్ సుధాకర్ రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఆత్మకూరు పట్టణంలోని కొంతమంది విశ్రాంతి ఉద్యోగ ఉపాధ్యాయులు, స్వేచ్ఛ కలిగిన వ్యక్తులు ఉచితంగా సేవలను అందించడం గొప్ప విషయమని వారు వారి సేవలను కూడా కొనియాడారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది కేవీ శేషారెడ్డి, రైతుసంఘ జిల్లా ప్రధానకార్యదర్శి మూలి వెంగయ్య, బీజెపి నాయకులు కుడుముల సుధాకర్ రెడ్డి, రైతుసంఘ మండల అధ్యక్షులు కృష్ణమోహన్, కార్యదర్శి లక్కు కృష్ణ ప్రసాద్, వెంకటరామిరెడ్డి, సాధిక్ హుస్సేన్, బడుగు శ్రీనివాసులు, పులిమి కృష్ణారెడ్డి, అబ్దులరాజాక్ తదితరులు పాల్గొన్నారు.

# కాకుపల్లి, మాదరాజుగూడూరులో పొలం పిలుస్తోంది



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలం కాకుపల్లి, మాదరాజు గూడూరు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసులు రైతులతో మాట్లాడుతూ.. వరిలో సాగులో పాటించవలసిన యాజమాన్య పద్ధతులు గురించి తెలియజేశారు. తదుపరి మండల వ్యవసాయాధికారి ఎస్వీ నాగమోహన్ మాట్లాడుతూ.. రబీ సీజనుకు అనుకూలమైన వరి విత్తనాలను గురించి విత్తన ఎంపికలో పాటించవలసిన మెలకువలు గురించి తెలియజేశారు. రైతులు నాణ్యమైన విత్తనాల కోసం అధికృత సంస్థల నుండి మాత్రమే విత్తనాన్ని సేకరించి మొలకశాతం పరీక్షించుకుని 80శాతం కంటే ఎక్కువగా మొలకశాతం ఉన్న విత్తనాలను మాత్రమే ఉపయోగిచాలని, విత్తనాలు కొనేటప్పుడు తప్పనిసరిగా బిల్ సేకరించి భద్రపరచుకోవాలని తెలియజేశారు. అనంతరం రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా సరఫరా చేసే వరి విత్తనాలను అందజేశారు. తదుపరి నారుమళ్ళను సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు అభిలాష్, ధర్మతేజ, స్థానిక నాయకులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ఒక క్యాడెట్ ఒక చెట్టు కార్యక్రమం విజయవంతం

**కృష్ణ చైతన్య డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్స్**




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు కృష్ణ చైతన్య డిగ్రీ కళాశాల క్యాంపస్‌లో పచ్చదనం పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎన్‌సీసీ క్యాడెట్లతో 'ఒక క్యాడెట్, ఒక చెట్టు' కార్యక్రమాన్ని మంగళవారం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 35 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు చెట్లను నాటి.. పచ్చదనాన్ని పెంపొందించడం పర్యావరణ పరిరక్షణ పట్ల తమ బాధ్యతను చాటారు. మొక్కలు పెంచడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించి.. పర్యావరణాన్ని కాపాడవచ్చు అని అవగాహన కల్పించారు. తమ కళాశాలలో విద్యార్థులకు ఎన్‌సీసీ ద్వారా క్రమశిక్షణ అలవర్చడమే కాకుండా విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందిస్తున్నామని ప్రిన్సిపల్ నాగయ్య తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర విఎంవి యూనిట్ ఎన్‌సీసీ ఆర్మీ స్టాఫ్ నాయబ్, ఎస్‌కె ఇబ్రహీం, ఎన్‌సీసీ కేర్ టేకర్ ఆఫీసర్ సిహెచ్ ప్రసాద్, ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు.

# తీరిన తాగునీటి కష్టాలు

**- ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపిన దళితులు**



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని చౌకచెర్ల గ్రామం చిన్న హరిజనవాడ ప్రజలకు ఎట్టకేలకు తాగునీటి కష్టాలు తీరాయి. ఇందుకు సహకరించిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి దళితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ గతంలో స్థానికంగా ఉన్న బావి పూడిపోయి చాలా ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. అయితే ఈ విషయాన్ని ఇటీవల పంచాయితీలు పర్యటించిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీనికి స్పందించిన ఆమె వెంటనే బావి పూడికతీత పనులు చేపట్టి స్థానిక ప్రజలకు తాగునీటి సమస్య తీర్చాలని సర్పంచు వినోద్‌ను ఆదేశించిందని తెలిపారు. దీంతో పూడికతీత పనులు చేపట్టి స్థానిక దళితులకు తాగునీటి సమస్యను తీర్చడం జరిగిందని తెలిపారు

## భక్తి శ్రద్ధలతో నాగుల చవితి



**కొడవలూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం నాగుల చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముఖ్యంగా కొడవలూరు రైల్వే గేటు సమీపంలో ఉన్నటువంటి నాగలపుట్ట దగ్గర తెల్లవారుజామున భక్తులు తల స్నానాలు చేసి పవిత్రంగా సజ్జలు పిండి పాలు తీసుకొని వచ్చి పిండిదిపారాధన చేసి పుట్ట చుట్టూ పుట్ట దారాలు చుట్టి మొక్కులు తీర్చుకున్నారు. జంతువులను పూజించడం భారత సనాతన సాంప్రదాయంగా వస్తున్న ఆచారం కారణంగా సమస్త జీవకోటి లోనూ ఈశ్వరుడు ఉన్నానని భక్తులు విశ్వసిస్తారు. అంతేకాకుండా మానవుడు మునుగడ ఆరంభం అయినప్పటినుండి జంతువులతో కలిసి జీవిస్తున్నాడు. ప్రకృతిని ఆరాధిస్తున్నాడు. అందులో భాగంగానే సర్పాలను కూడా పూజిస్తున్నారు. నాగుపామును నాగదేవతగా నాగరాజుగా పూజిస్తుంటారు. ముఖ్యంగా దీపావళి అమావాస్య తర్వాత వచ్చే కార్తీక శుద్ధ చవితి నాడు నాగుల చవితి భక్తలు జరుపుకుంటున్నారు.

## విత్తన శుద్ధి తప్పనిసరి



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** వరి సాగులో రైతులు విత్తన శుద్ధిని తప్పనిసరిగా పాటించాలని మండల వ్యవసాయ అధికారి వెంకట కృష్ణయ్య కోరారు. మండలంలోని మన్మధరావుపేట, విడవలూరు గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రైతు నారుమడులు వేసే సమయానికి ముందు విత్తన శుద్ధిని చేయాలని తెలిపారు. ఒక కేజీ విత్తనాలను మూడు గ్రాముల సుడోమోనాస్తో శుద్ధి చేసిన తర్వాత విత్తనాలను చల్లాలని తెలిపారు. దీనివల్ల వరి పైరు అగ్గి తెగులు నుంచి రక్షింపబడుతుందని సూచించారు. అలాగే సకాలంలో నారుమడులను సిద్ధం చేసుకుని విత్తనాలు చల్లుకోవాలని తెలిపారు. వరి సాగులో ప్రాథమిక దశ నుంచి వ్యవసాయ అధికారి సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అరుణకుమారి రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా నాగుల చవితి వేడుకలు



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండల పరిధిలోని వివిధ గ్రామాలలో నాగుల చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయాలలో పూజలు చేయడంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జలదంకి మండలంలో నాగుల చవితి పండుగను మహిళా భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. సోమవారం పుట్టలో పాలు పోశారు. మంగళవారం ఉదయం వరకు నానబెట్టిన సజ్జలు, పాలను సేవిస్తూ నాగమ్మను భక్తిశ్రద్ధలతో తలచుకుంటూ మహిళా భక్తులు ఉపవాసం ఉంటారు. మంగళవారం ఉదయాన్నే మరల పుట్ట వద్దకు వెళ్లి నాగమ్మకి పాలు, నైవేద్యం సమర్పించి తమ ఉపవాసాన్ని ముగిస్తారు. అనంతరం మునగాకు కూరతో ఆహారం ప్రతి సంవత్సరం తమ కోరికలు తీరాలంటూ నాగుల చవితి నాడు నాగమ్మకు మహిళలు ప్రణమిల్లుతారు.

# జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో క్యాన్సర్ పై అవగాహన




**కావలి, మేజర్‌న్యూస్ :** పట్టణంలో వీవీఆర్ కాలేజీ నందు ఇట్స్ కళాశాల ప్రిన్సిపల్ శేషయ్య ఆధ్వర్యంలో జన విజ్ఞాన వేదిక కావలి రెడ్ క్రాస్ సంయుక్తంగా అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ లక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. క్యాన్సర్ అన్నది లంగ్ క్యాన్సర్, బ్లడ్ క్యాన్సర్, స్కిన్ క్యాన్సర్‌గా వివిధ రూపాల్లో అది బాడీలో ప్రవేశిస్తుందని తెలియజేశారు. ప్రపంచంలో రెండవ అత్యంత సాధన క్యాన్సర్ లంచ్ క్యాన్సర్‌ని ఈ క్యాన్సర్ గాలి, కాలుష్యం స్మోకింగ్, సెకండ్ హ్యాండ్ స్మోక్, ధూమపానం అలవాటు లేకపోయినా అలవాటు ఉన్న వాళ్ళ వదిలే పొగను పీల్చడం వలన కూడా ఇటువంటి వ్యాధులు సంభవిస్తాయని తెలిపారు. కుటుంబ వారి వృత్తుల వలన వ్యాధులు కూడా వచ్చే దానికి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ధూమపానం మానుకోవడం ఇంట్లో లేదా పని చేయు ప్రదేశాల్లో పొగరహిత వాతావరణం ఏర్పాటు చేసుకోవడం ఆరోగ్య ఆహారం ఆరోగ్యంవంతమైన ఆహారం తీసుకోవడం క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వాయు కాలుష్యం నుంచి దూరంగా ఉండడం రెగ్యులర్ హెల్త్ చెకప్‌తో లంగ్ క్యాన్సర్‌ను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెడ్స్ కళా శాల ప్రిన్సిపాల్ డాక్టర్. శేషయ్య వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ సుబ్బయ్య చీఫ్ మెడికల్ ఆఫీసర్ జి.కన్యాకుమారి పి.పద్మజ, పట్టణ జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు ప్రధాన కార్యదర్శి గాదిరెడ్డి, హరినాథ్ జెవివి ఉపాధ్య క్షులు కే.హరినారపరెడ్డి, సంయుక్త కార్యదర్శి కన్నయ్య, హాజరత్ అయ్యా కీర్తి ప్రొఫెసర్ లెక్చరర్స్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు పంటల భీమా నమోదు చేసుకోండి



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** రైతులు రబీ సీజనులో సాగు చేయుచున్న శనగ, మినుము, పెసర, వేరుశెనగ పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనపథకం పంటల భీమాను నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి రవికుమార్ తెలిపారు. మంగళవారం వరికుంటపాడు, రామాపురం గ్రామ పంచాయతీలలో వ్యవసాయ శాఖ అధికారి రవికుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి రవికుమార్ మాట్లాడుతూ.. రైతులు రబీ సీజనులో సాగు చేయుచున్న శనగ, మినుము, పెసర, వేరుశెనగ పంటల భీమా డిసెంబర్ 15 తేదీలోపు నమోదు చేసుకోవాలని, అలాగే వరి పంట సాగు చేయు రైతులు డిసెంబర్ 31వ తేదీ లోపు మీసేవ కేంద్రం లేదా బ్యాంకుల లో నగదు చెల్లించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కొరకు పంటల బీమా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఒక హెక్టారు శనగ పంటకు 140 రూపాయలు, మినుము పంటకు 95 రూపాయలు, పెసర పంటకు 90 రూపాయలు, వేరుశనగ పంటకు 150 రూపాయలు, వరి పంటకు 420 రూపాయలు చొప్పున ప్రీమియం ధర చెల్లించి రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కొరకు పంటల బీమా నమోదు చేసుకోవాలి అని తెలిపారు. ఈ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనపథకం నమోదు చేసుకోవడం వలన రైతులకు పంటల దిగుబడిలో ఏమైనా నష్టం వాటిల్లినట్లయితే ఒక హెక్టారుకు శనగకు రూ.70వేలు, మినుముకు రూ.47,500, పెసరకు రూ.45వేలు, వేరుశనగకు రూ.75వేలు, వరికి రూ.1,05,000 భీమా చొప్పున నగదు వస్తుందని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, పశు సంవర్ధక సహాయకులు సుబ్బారాయుడు, కిషోర్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# పసుపులో దుంప కుళ్ళు తెగుళ్లను అరికట్టండి : ఏఓ



**సీతారామపురం, మేజర్‌న్యూస్ :** పసుపు పంటలో తొలి దశలో ఏర్పడే దుంప కుళ్ళు తెగుళ్లను మొదటి దశలోనే అరికడితే పంటకు తీవ్ర నష్టం వాటిల్లకుండా ఉంటుందని మండల వ్యవసాయ అధికారి పి.చెన్నారెడ్డి తెలిపారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా చింతూడు గ్రామంలోని పసుపు రైతులతో కలిసి సాగులో ఉన్న పసుపు పంటలను పరిశీలించారు. పంటలలో దుంప కుళ్ళు వ్యాధిని గమనించి రైతులకు తగు సూచనలు తెలియజేశారు. ఈ వ్యాధి ప్రబలితే మొక్క క్రమేపి ఎండిపోతుందని తెలిపారు. దీని నివారణకు ఒక లీటర్ నీటిలో మూడు గ్రాముల కాపర్ ఆక్సిడ్ ద్రావణాన్ని మొక్క మొదట్లో వేయాలని సూచించారు. పంటకు నీటి తడులు సైతం ఎక్కువగా వేయకూడదని, పంటలో నీరు ఎక్కువగా నీరు నిలువ ఉంటే ఇలాంటి తెగుళ్లు వస్తాయని తెలిపారు. అనంతరం పెద్దనాగంపల్లి గ్రామంలో సాగులో ఉన్న వరి పంటను పరిశీలించి, వరి రైతులకు తగు సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఉదయగిరి అసిస్టెంట్ చిరంజీవి, ఏఈఓ సాంబశివరావు, వెటర్నరీ అసిస్టెంట్ మహేశ్వరి, అగ్రికల్చర్ లక్ష్మీనారాయణ, చిన్నగంపల్లి ఉప సర్పంచ్ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలంలోని గ్రామాల్లో నాగుల చవితి పండుగను మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రమైన ఏఎస్ పేటలోని బ్యాంకు సమీపంలో ఉన్న పుట్ట వద్ద మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయాన్నే స్నానం చేసి పడి వస్త్రాలతో పుట్ట వద్దకు వెళ్లి ప్రదక్షణలో చేసి పుట్టలో పాలు పోసి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పుట్టల వద్ద బారులు తీరిన భక్తులు



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** నాగులచవితి పండుగను భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచి మండలంలో నాగుల చవితి పండుగ సందడి కనిపిచింది. పొదలకూరు పట్టణంలోని పలు గ్రామాల్లో గిరిజన ప్రాంతాల్లో కూడా గిరిజన వాసులు నాగులచవితి పండుగను జరుపుకున్నారు. ప్రతి ఏడాది దీపావళి తర్వాత ఐదవ రోజున వచ్చేది నాగుల చవితి. ఈ నాగుల చవితిని పండగను భక్తులు, వారి బంధువులు, అందరూ పుట్ట దగ్గరికి వెళ్లి నాగేంద్రుడికి పూజలు చేసి పాలు పోసి తమ కుటుంబాలను నాగేంద్రుడు కాపాడాలని పూజలు చేశారు. భక్తులు నాగుల చవితి సందర్భంగా పుట్ట దగ్గర దీపావళి తరహాలో బాణాసంచా కాల్చి సందడి చేశారు. అక్కడే తమ బంధువులతో భక్తులు భోజనాలు తయారు చేసుకుని ఆనందంగా ఉల్లాసంగా గడిపారు.

## అనుపల్లికి ఆదాల పరామర్శ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** కోవూరు పట్టణానికి చెందిన అనుపల్లి అశోక్‌రెడ్డి సతీమణి సులోచనమ్మ సోమవారం కాలం చేశారు. ఈ నేపథ్యంలో నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు ఆదాల ప్రభాకర్ రెడ్డి మంగళవారం అనుపల్లి నివాసంకు వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆమె మరణానికి గల కారణాలను అనుపల్లి అశోక్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఆమె ఆకస్మిక మరణం కలచివేసిందని, సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనుపల్లిని పరామర్శించిన వారిలో నెల్లూరు విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, జడ్పీటీసీ మల్లు సుధాకర్ రెడ్డి, స్వర్ణ వెంకయ్య, శశికాంత్, బెల్లంకొండ వెంకయ్య, కార్య నవీన్ తదితరులు ఉన్నారు.

## రెడ్ క్రాస్ రక్తకేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీఓ



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి ఆర్డీఓ వంశీకృష్ణ మంగళవారం రెడ్ క్రాస్ రక్తకేంద్రాన్ని పరిశీలించారు. రక్తకేంద్రం కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవి కుమార్ రక్తకేంద్రంలో నిర్వహించే రక్తపరీక్షలు, వివిధ ఆధునిక యంత్ర సామాగ్రిని ఆర్డీఓకు వివరించారు. గత 8 సంవత్సరాలుగా కావలి రెడ్ క్రాస్ రక్తకేంద్రం, రక్తసేకరణలో రాష్ట్ర స్థాయిలో ప్రధమ స్థానంలో ఉందని తెలిపారు. పలు మహా నగరాలలో సైతం లేని కాంపోనెంట్ బ్లాక్‌ను తమ రక్తకేంద్రంలో పట్టణ దాతలు, జిల్లా రెడ్ క్రాస్ సహకారంతో సమకూర్చుకున్నామని డాక్టర్ రవికుమార్ ఆర్డీఓకు వివరించారు. ఈ సందర్భంగా మొదటిసారి రెడ్ క్రాస్‌కు విచ్చేసిన ఆర్డీఓ వంశీకృష్ణ ను రెడ్ క్రాస్ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ బాధ్యులు రవిప్రకాష్, కలికి శ్రీహరిరెడ్డి, హరినారప రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సాధనకై భారీ ర్యాలీ

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో గురువారం ఉదయగిరి పట్టణంలో నియోజకవర్గ స్థాయిలో భారీ ర్యాలీ జరుగుతుందని ఆ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ర్యాలీలో రాజకీయాలకతీతంగా ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజాసంఘాల నాయకులు, యువత, అన్నివర్గాల ప్రజలు భారీసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# పూర్వప్రాథమిక విద్యపట్ల అవగాహన పెంపొందించుకోవాలి







## న్యూట్రిగార్డెన్స్‌ను శ్రద్ధతో పెంచాలి : సీడీపీఓ సునీలత

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** అంగన్‌వాడీ కేంద్రాల్లోని పూర్వప్రాథమిక విద్యపట్ల సమాజంలో అందరికీ అవగాహన అవసరమని, ప్రధానంగా చిన్నారుల తల్లి దండ్రులకు మరింత అవసరమని, ఆత్మకూరు ఐసీడీఎస్ సీడీపీఓ పి.సునీలత పేర్కొన్నారు. ఆమె మంగళవారం ఆత్మకూరు మండలం కరటంపాడులో అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ప్రతినెలా 5వతేదీ ఇసిసిఇడే కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమం నిర్వహించి అందరికీ పూర్వప్రాథమిక విద్య గురించి అవగాహన కల్పిస్తుంటారన్నారు. ఈ కార్యక్రమాన్ని తాను పరిశీలించానన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారంతోపాటు ఆటపాటలతో కూడిన పూర్వప్రాథమిక విద్య అందిస్తున్నామన్నారు. తద్వారా చిన్నారులను సమీప అంగన్‌వాడీ కేంద్రాలకు రప్పించి పూర్వప్రాథమిక విద్యను బలోపేతం చేస్తుంటామని సిడిపివో పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆమె అంగన్‌వాడీ కార్యకర్త సురేఖ నిర్వహిస్తున్న పోషన్‌వాటిక న్యూట్రిగార్డెన్‌ను పరిశీలించారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఈ న్యూటిగ్రార్డెన్‌లో మొక్కల పెంపకం, నిర్వహణ తదితరాలను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె బాలింతదర్శనంలో భాగంగా బాలింతల గృహాలకు వెళ్ళి తల్లీ, బిడ్డ ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. టీకాలు తదితరాలను సకాలంలో వేయిస్తున్నారా, తల్లిపాలనే బిడ్డకు ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్న సునీలత వారికి పలు సూచనలు చేశారు. తదుపరి అంగన్‌వాడీకేంద్రాల ద్వారా లబ్దిదారులకు ఇస్తున్న పోషకాహార సరుకులు, కోడిగ్రుడ్లు, పాలు తదితరాల పంపిణీ (టిహెచ్‌ఆర్) గురించి అందరినీ అడిగి తెలుసుకున్నారు. వాటిని తప్పకుండా గర్భిణీలు, బాలింతలే వాడుకోవాలని సడీపీఓ సూచించారు. ఈకార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్.కేశవనారాయణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు సురేఖ, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యంపట్ల అప్రమత్తంగా ఉండాలి

## జిల్లా వైద్యాధికారి డాక్టర్ పెంచలయ్య



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ప్రజల ఆరోగ్యంపట్ల వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య సూచించారు. ఆయన మంగళవారం ఆత్మకూరులోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిమోనియా, చిల్డ్రన్ మానిటరీగ్రోత్ చార్ట్, హెచ్‌బిఎన్‌సి, హెచ్‌బివైసి, ఏఎన్‌సి, డిఎన్‌సి, హైరిస్క్, ఫ్యామిలీప్లానింగ్ తదితరాల గురించి సిబ్బందికి సలహాలిచ్చారు. సీజనల్ వ్యాధులు, డెంగ్యు,మలేరియా, చికెన్ గున్యా, టైఫాయిడ్ తదితర వ్యాధులు సోకకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట్ల మెడికల్‌క్యాంప్‌లు నిర్వహించాలని డాక్టర్ పెంచలయ్య సూచించారు. మురుగునీటి గుంటలను గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడబడితే అక్కడ చెత్తవేయకుండా మున్సిపల్ బండిలోనే వేసేలా చూడాలని, విద్యార్థులకు తరచూ వైద్యపరిక్షలు నిర్వహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ షేక్ అస్మా, ఎంపిహెచ్‌యివో ఎస్.సుధాకర్, ఎంపిహెచ్ఎస్ యు.పార్వతి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అధిక సంఖ్యలో గిరిజనుల సభ్యత్వం నమోదు



**నెల్లూరు/నవాబుపేట, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని 24వ డివిజన్ కనపర్తిపాడు గిరిజన కాలనిలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వం నమోదు కార్యక్రమం చేయటం జరిగింది నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆశీస్సులతో తెలుగుదేశం పార్టీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సూచనలతో గిరిజనులకు సభ్యత్వం నమోదు చేస్తే బాగుంటుంది వారికీ ఎంతో కొంత ఉపయోగం ఉంటుందని తెలుగుదేశం పార్టీ గిరిజన నాయకులు పాలకీర్తి రవి ఆధ్వర్యంలో గిరిజన కాలనిలో సభ్యత్వం నమోదు చెయ్యమని చెప్పటం జరిగిందని తెలియజేశారు. అయొక్క భాగంలో అత్యధికంగా సభ్యత్వాలు నమోదు అవటం చాలా సంతోషంగా ఉందని పాలకీర్తి రవి అన్నారు. ఈ కార్యక్రమంలో చల్లంచర్ల శ్రీనివాసులు టీడీపీ నాయకులు హరికృష్ణ, సుధాకర్, తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## సునామి విపత్తులపై అవగాహన పెంచుకోవాలి

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** సునామిలాంటి విపత్తులపై మత్స్యకారులు అవగాహన కలిగి ఉండాలని ఆర్డీవో నాగ సంతోషి అనూష అన్నారు. మంగళవారం కృష్ణపట్నం గ్రామపంచాయతీ ఆర్కాటిపాలెం గ్రామంలో సునామీపై మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. మెరైన్ పోలీసులతో పాటు వైద్య ఆరోగ్యశాఖ, రెవిన్యూ, మత్స్యశాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమం గురించి గ్రామస్తులకు అధికారులు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ బాలకృష్ణారెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పొగాకు పైరుకు బదులుగా..

# పప్పు ధాన్యాల సాగును చేయండి




**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** పొగాకు పైరుకు బదులుగా పప్పు ధాన్యాల సాగుపై రైతులు చొరవ చూపాలని ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు వి.దేవసేనమ్మ పేర్కొన్నారు మంగళవారం ఏఎస్ పేట మండలంలోని చిరమణ శ్రీ కొలను గ్రామాల్లోని రైతు సేవ కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు ఏటీటీ రజిని ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సహాయ వ్యవసాయ సంచాలకులు దేవసేనమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పొగాకు ఉత్పత్తుల వలన మానవాళి ఆరోగ్యమునకు ముప్పు ఉన్నందున సాగు వాడకం తగ్గించాలని సూచించారు పొగాకు పైరుకు బదులుగా పచ్చిశనగపైరును వేసుకోవాలని తెలిపారు. అందువల్ల రైతులకు సుస్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చునని తెలిపారు. శనగ, పప్పు ధాన్యాల సాగుపై గత వారం హసనాపురం వేల్పులగుంట గ్రామాలలో అవగాహన సదస్సులు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ చిరంజీవి విహెచ్ఎ సంధ్యారాణి ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# కాకాణి హౌస్ అరెస్ట్ పరిస్థితి ఉద్రిక్తతం

## ● సోమిరెడ్డి అవినీతి చేస్తే.. చూస్తూ ఊరుకోవాలా ! ● మాజీ మంత్రి కాకాణి విమర్శ

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో మంగళవారం పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. సోమిరెడ్డి అవినీతిని బట్టబయలు చేసేందుకు రైతులతో కసి కనుపూరు కాలువకు బయలుదేరిన కాకాణిని పోలీసులు అడ్డుకొని గృహ నిర్బంధంలో ఉంచారు. విషయం తెలుసుకున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కాకాణి నివాసానికి భారీగా తరలిరావడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని అడ్డుకునేందుకు తెలుగుదేశం పార్టీ విఫలయత్నం చేసి, చివరకు హౌస్ అరెస్ట్ చేయడంతో పోలీసులపై కాకాణి మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తాము సోమిరెడ్డిని అడ్డుకొని ఉంటే, అల్లీపురం నుండి కూడా బయటకు రాలేకపోయేవాడని చెప్పారు. సోమిరెడ్డి విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతూ.. నవంబర్ 11వ తేదీ వరకు టెండర్లకు గడువు ఉన్నా, నామమాత్రంగా ముందుగానే పనులు ప్రారంభించి, కోట్లు కొల్లగొట్టడానికి వేసిన స్కెచ్ బహిర్గతమవుతుందని సోమిరెడ్డి భయపడి పోలీసులను పురమాయించాడని విమర్శించారు. సోమిరెడ్డి అవినీతికి, అక్రమాలకు అంతులేకుండా, కోట్లాది రూపాయలు ప్రజా ధనాన్ని కొల్లగొడుతుంటే



చూస్తూ ఊరుకోలేమన్నారు. పోలీసులు సోమిరెడ్డి అవినీతికి భద్రత కల్పిస్తూ, వాస్తవాలు తెలుసుకోవడానికి సోమిరెడ్డి దోపిడీ ప్రజలకు తెలియజెప్పడానికి బయలుదేరుతున్న తమను అడ్డుకోవడంతోనే కూటమి ప్రభుత్వ నైజం బయటపడిందన్నారు. సోమిరెడ్డి అవినీతిపై పోరాటం కొనసాగుతుంది తప్ప.. వదిపెట్టే ప్రసక్తే లేదని చెప్పారు.

# ప్రొఫైలింగ్ యాప్‌లో సమగ్ర సమాచారం పొందుపరచాలి

## మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్ర




**కావలి, మేజర్‌న్యూస్ :** స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన సమగ్ర సమాచారంను ప్రొఫైలింగ్ యాప్‌లో పొందు పరచాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్ర తెలిపారు.మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో కావలి పురపాలక సంఘంలో పనిచేస్తున్న సిబ్బందికి, రిసోర్స్ పర్సన్‌లకు ప్రొఫైలింగ్ యాప్‌లపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో సంచాలకులు మాట్లాడుతూ.. గత కొద్ది సంవత్సరాలుగా మెప్మాలో ఉన్న మహిళా సంఘాలకు సంబంధించిన సమగ్ర సమాచారం ఆన్‌లైన్‌లో లేనందువలన ప్రస్తుతం సంబంధిత డైరెక్టర్ మెప్మా గుంటూరు వారి ఆదేశాల మేరకు ప్రొఫైలింగ్ యాప్ నందు నిజమైన సమాచారాన్ని పొందుపరచుటకు ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. మిషన్ డైరెక్టర్ ఆదేశాల మేరకు మహిళా సంఘాలతో జరుగుతున్న పొదుపులు అప్పుల వివరాలతో పాటు గ్రూపు సభ్యులకు సంబంధించిన ప్రాథమిక, సాంఘిక, ఆర్థిక నిజమైన సమాచారాన్ని పొందుపరచడం జరుగుతుందని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు పేదరికం నుంచి ఉన్నత స్థితిలోకి వచ్చుటకు ఆర్థిక ప్రణాళికను తయారు చేయుటకు ప్రొఫైలింగ్ యాప్ ఎంతగానో వారికి ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతినెల మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను అమ్ముకొనుటకు అర్బన్ మార్కెటింగ్ ద్వారా అవకాశం కల్పిస్తుందని తెలిపారు. ప్రస్తుతం సమగ్ర సమాచారం నింపుటకు రిసోర్స్ పర్సన్ అందరూ కృషి చేయాలని వారు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ జి. శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, కావలి మున్సిపాలిటీలో ప్రతి సంఘం సభ్యురాలు యొక్క సమగ్ర సమాచారాన్ని సేకరించి ప్రభుత్వ పథకాలు అందరికీ అందే విధంగా ప్రతి రిసోర్స్ పర్సన్ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయిలో పనిచేస్తున్న టీఈఐ బీ.అంకయ్య టీఈఎస్ఎస్ కాంతయ్య, ఐటి అంకర్ పర్సన్ శంకర్, సీఎంఎం భారతి, సీఓ. ఎస్.కిరణ్ కుమార్, లక్ష్మీప్రసన్న, శైలమ్మ, డీఈఓబి డిఆర్పి, సెల్ఫ్ గ్రూపుల రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

# ఎరువుల కొరత లేకుండా చూడాలి : జిల్లా కలెక్టర్ ఆనంద్

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** జిల్లాలో వ్యవసాయ సీజన్ ప్రారంభమైన దృష్ట్యా విత్తనాలు, ఎరువులు కొరత లేకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లో వ్యవసాయ అనుబంధ రంగాలలో అమలవుతున్న కార్యక్రమాలు, లక్ష సాధనకై కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పంటల విస్తీర్ణాన్ని దృష్టిలో పెట్టుకుని అవసరం మేరకు ఎరువులు సిద్ధంగా



ఉంచుకోవాలన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తూ ఎరువుల కొరత రాకుండా చూడాలన్నారు. రైతులకు ఉపయోగపడే విధంగా పొలంబడి కార్యక్రమాలు పటిష్టంగా నిర్వహించాలన్నారు. సిసిఆర్సి కార్డులు, భూసార పరీక్ష కార్డులు నూరు శాతం రైతులు అందించాలన్నారు. ఏపీఎంఐపీ పథకం కింద మంజూరైన మైక్రో ఇరిగేషన్ పరికరాల కు సంబంధించి రైతుల వాటాను చెల్లించే విధంగా వ్యవసాయ, ఉద్యానవన, ఏపీఎంఐపీ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ ఏడాది సాగు చేపడుతున్న ఉద్యాన పంటలైన ఆయిల్ ఫామ్, నిమ్మ తదితర పంటలకు డ్రిప్ ఇరిగేషన్ అనుసంధానం చేయాలన్నారు పశువుల షెడ్ల నిర్మాణ పనులు, పశుగణన వేగవంతం చేయాలని పశుసంవర్ధక శాఖ జెడి కి సూచించారు. బ్యాంకర్లు, అధికారులు మత్స్యకార గ్రూపులతో సమావేశాలు నిర్వహించి మేకనైజ్డ్ బోట్లు పొందే విధంగా చైతన్యం తీసుకోవాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలలో వివిధ రకాల ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి ముందుగానే పంటల్లో వచ్చే తెగుళ్లను గుర్తించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలలో అమలవుతున్న పథకాల లక్ష్యసాధనకు కృషి చేయాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్య వాణి, పశుసంవర్ధక శాఖ జెడి రమేష్ నాయక్, ఏపీఎంఐపీ పిడి శ్రీనివాసులు, మార్కెటింగ్ ఏడి అనిత, ఆత్మా పీడీ, హార్టికల్చర్, పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోండి



**సీతారామపురం, మేజర్‌న్యూస్ :** ఉపాధి హామీ పథకాన్ని సీతారాంపురం మండలంలోని 14 పంచాయతీ రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ మురళి తెలిపారు. మంగళవారం ఉపాధి హామీ కార్యాలయంలో జరిగిన 2024 –25 ఆర్థిక సంవత్సరం కొత్త పనుల ప్రతిపాదనలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. ఈ పథకం ద్వారా రైతులు పొలాలలో ఇంకుడు గుంతలు దకోఫండ్స్, కాలువల పూడిక తీతలు, పనులు చేసుకోవచ్చని తెలిపారు. పనులు కావలసిన రైతులు తమ పట్టాదారు పాస్ బుక్, ఆధార్ కార్డు, జాబ్ కార్డు తీసుకొని ఉపాధి హామీ కార్యాలయంలో సంప్రదిస్తే వారి పొలాలలో పనులు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీతారాంపురం సర్పంచ్ కొడవటి కంటి భాగ్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

# కూటమి పాలనలోనే అభివృద్ధి

- మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరు భేష్
- కౌన్సిల్లో కో ఆప్షన్ సభ్యుడు నూనె మల్లికార్జున్ యాదవ్



**నెల్లూరు/ కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి శరవేయంగా జరుగుతుందని నగర పాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు నేను మల్లికార్జున యాదవ్ అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో మంగళ వారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూనె మల్లికార్జున్ యాదవ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి నక్కకి నాగలోకానికి ఉన్న తేడా ఉందన్నారు. జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు, గత వైకాపాలనలో అనేక అక్రమాలు జరిగాయని, వీటిపై విజిలెన్స్ విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యంగా పారిశుధ్యం టౌన్ ప్లానింగ్ విభాగాలపై కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్పొరేషన్ కొనుగోలు చేసిన పరికరాలపై కూడా విచారణ జరపాలని కోరారు. అక్రమాలకు పాల్పడే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముందుగా ప్రధానమంత్రి మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలతో కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకున్నారు.

# శుభన్ భోజనం ఏర్పాటు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని దళితవాడ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల విద్యార్థులకు మంగళవారం ఎంఈవో–2 తోట శ్రీనివాసులు తన జన్మదినం సందర్భంగా శుభ్దిన్ భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు. చిన్నారులకు రుచికరమైన భోజనం తోపాటు పండ్లు, మిఠాయిలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు షేక్ షబ్బీర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగగానే వెంటనే..

# సమాచారం అందించాలి : జిల్లా కలెక్టర్

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు యాజమాన్యాలు సత్వరమే స్పందించి ప్రభుత్వ యంత్రాంగానికి సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్ అన్నారు. మంగళవారం ఎస్ఆర్ శంకరన్ హాల్లో పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన ముందస్తు చర్యల గురించి జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పరిశ్రమలలో ప్రమాదం సంభవిస్తే సంబంధిత తహసీల్దార్ ఆర్డీవో కలెక్టర్, ఫైర్ తదితర శాఖల అధికారులకు వెంటనే తెలియజేయడం యాజ మాన్యాల కనీస బాధ్యత అని అన్నారు. చిన్న చిన్న ప్రమాదాలు జరిగినా వెను వెంటనే జిల్లా యంత్రాంగానికి తెలియ పర్చాలన్నారు. ఫ్యాక్టరీ, పరిశ్రమలు, కార్మిక, ఫైర్, బాయిలర్స్ శాఖల అధికారులతో కూడిన కమిటీ పరిశ్రమల్లో ప్రమా దాల నివారణకు చేపట్టవలసిన చర్యల గురించి ఉమ్మడి తనిఖీలు నిర్వహించాలన్నారు. తనిఖీల్లో గుర్తించి లోటు పాట్లను సరి చేయించాలన్నారు. ఈ తనిఖీల ఉద్దేశం ఆయా యాజమాన్యాలను ఇబ్బంది పెట్టడం కాదని, కేవలం పరిశ్రమలో






ప్రమాదాలు ఎదురైనప్పుడు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలు గురించి వారికి అవగాహన కల్పించడమే నన్నారురక్షణ సౌకర్యాలు మెరుగు పరచాలన్నారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయని, ప్రమాదాలు జరగకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలూ తీసుకోవాలన్నారు. పరిశ్రమల్లో తనిఖీల సందర్భంగా గతంలో జరిగిన ప్రమాదాల వివరాలను కూడా పరిశీలించాలన్నారు. అప్పుడే వాటిని ఎదుర్కొనేందుకు తీసుకున్న చర్యలను తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా పరిశ్రమల్లో అంతర్గత భద్రతకు తీసుకున్న చర్యల మాదిరే, పరిశ్రమలన్నీ కలిపి సామూహికంగా అంబులెన్స్ల ఏర్పాటు, భద్రతా పరికరాలను ఒక పూల్‌గా ఏర్పాటు చేసుకోవడం వంటి భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా పరిశ్రమల ప్రతినిధులు అడిగిన విధంగా ముత్తుకూరు పరిసర ప్రాంతంలో ఫైర్ స్టేషన్ నిర్మాణానికి, ఈఎస్ఐ వైద్యశాల స్థాయి పెంచ దానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. ఈ సమావేశంలో కార్మిక శాఖ డిప్యూటీ కమీషనర్ వెంకటేశ్వర్లు, పరిశ్రమల శాఖ జియం మారుతీ ప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ అశోక్ కుమార్, ఫాక్టరీ ఇన్స్పెక్టర్ శైలేంద్ర కుమార్, బాయిలర్స్ ఇన్స్‌ఫెక్టర్ సుష్మ, అగ్నిమాపక శాఖ ప్రతినిధి షరీఫ్, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కనుపూరు కాలువ వద్ద ఉద్రిక్తత..

## వైసీపీ - టీడీపీ వర్గీయుల మధ్య తీవ్ర వాగ్వాదం.. స్వల్ప తోపులాట



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పొదలకూరు మండలం సంగం ఆనకట్ట సమీపంలోని కనుపూరు కాలువ వద్ద మంగళవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. గత నాలుగు రోజులుగా టీడీపీ నాయకులు రైతుల భాగస్వామ్యంతో రైతులకు నారు మడులకే సాగు నీరు అందించాలని, గత ఏడాది లాగా ఆలస్యం కాకుండా సంగం ఆనకట్ట వద్ద మిషనరీతో కనుపూరు కాలువ పూడిక పనులు మొదలుపెట్టారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి టెండర్లు పిలవకుండానే కాలువ పూడికతీత పనులు ఎలా చేస్తారని,సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టి మంగళవారం మాజీ మంత్రి కాకాణి కాలువను పరిశీలించేందుకు కార్యక్రమం ఏర్పాటు చేశారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో కనుపూరు కాలువ పూడికతీత పనుల్లో మాజీ మంత్రి కాకాణి తీవ్ర అవినీతికి పాల్పడ్డారని, తట్ట మట్టి ఎత్తి వేయకుండానే కోట్ల రూపాయలు నిధులు స్వాహా చేశారని అప్పట్లో సోమిరెడ్డి కొన్ని ఆధారలను బయట పెట్టారు. పూడికతీత పనుల్లో కోట్లు రూపాయలు అవినీతి పాల్పడిన వ్యక్తి కాకాణి, టీడీపీ వర్గీయులు రైతుల భాగస్వామ్యంతో చేసే పనులను పరిశీలించి, రైతులకు సాగునీరు అందకుండా చేయడానికి వస్తున్నారని టిడిపి నేతలు గ్రహించారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో కనుపూరు కాలువ వద్దకు చేరుకున్నారు. ఇరు పార్టీల వారు సంగం ఆనకట్ట వద్ద చేరుకోవడంతో కొంత హై టెన్షన్ నెలకొంది. పరస్పరం వారి వారి నాయకుల నాయకత్వం వర్ధిల్లాలి అంటూ స్లొగన్స్ ఇచ్చుకోవడంతో ఉద్రిక్తత పెరిగింది. దీంతో పొదలకూరు సీ.ఐ శివరామకృష్ణ రెడ్డి,ఎస్ఐ హనీఫ్ తమ సిబ్బంది, రోప్ సాయమతో సంఘటన స్థలంలోని ఇరువర్గాల వారికి సర్ది చెప్పి రోప్ సాయంతో వైసీపీ వర్గాన్ని సంగం ఆనకట్ట నుంచి గ్రామంలోకి పంపించారు. ఈ సందర్భంగా పొదలకూరు టిడిపి మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్ బాబు మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంలో చేయని కాలువ పూడికతీత పనులకు బిల్లులు పెట్టుకొని కోట్ల రూపాయలు కాజేశారని, ఇప్పుడు టిడిపి ప్రభుత్వం రాగామే రైతులతో కలసి తాము కనుపూరు కాలువ పూడికతీత పనులు మొదలు పెడితే మాజీ మంత్రి తమ నాయకులను, గ్రామస్థులను ఉసిగొల్పి రైతులకు సాగునీరు రాకుండ అడ్డుకోవడం సిగ్గు చేటన్నారు. గత వైసీపీ హయాంలో మాజీ మంత్రి కాకాని పడవలతో కేవలం గుర్రపు డెక్కన్ మాత్రమే తొలగించి పూడిక తీయకుండానే తట్టమట్టే ఎత్తకుండానే కోట్ల రూపాయలు దోచేశారన్నారు తాము మిషనరీ సాయంతో శుభ్రంగా పూడిక తొలగిస్తూ ఉంటే కూడిక తీయగానే సకాలంలో రైతులకు సాగునీరు అందిస్తే తమకు ఎక్కడ మంచి పేరు వస్తుందోనని అది జర్నించుకోలేని కాకాని వైసిపి నాయకులను కార్యకర్తలను తమపై ఎగదోలారన్నారు కాకాని గత వైసిపి హోయంలో ఎప్పుడు టెండర్లు పిలవలేదని టెండర్లు పిలవకుండానే పనులు చేశారని గుర్తు చేశారు. రైతులకు మంచి జరిగే కార్యక్రమాలను వైసీపీ నాయకులు ఓర్చుకోలేక అడ్డుకుంటే తగిన బుద్ధి చెబుతామని టీడీపీ నాయకులు హెచ్చరించారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ జీ.శ్రీనివాస రావు, సీఐలు రవి నాయక్, వేమారెడ్డితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొద్దులూరి మల్లికార్జున్ నాయుడు, కోడూరు పెంచల భాస్కర్ రెడ్డి, పార్లపల్లి సురేష్ రెడ్డి, కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, గంటా మల్లికార్జున్ యాదవ్, కృష్ణ యాదవ్, సుధాకర్ రెడ్డి, హనుమారెడ్డి, అజయ్ రెడ్డి, జమీర్, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.



సూర్య
www.suryaa.com
రిపోర్టర్స్ కావలెను



తెలుగు పత్రికా రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దిన పత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకుల కావలెను.

కావలసిన సెంటర్లు

నెల్లూరు జిల్లాలోని అల్లూరు, దగదర్తి, దుత్తలూరు, కొండాపురం, చేజర్ల, మనుబోలు, కొడవలూరు, బుచ్చి, కోవూరులలో విలేకర్లు కావలెను.

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

సూర్య కార్యాలయం, మిలిటరీ కాలనీ, రోడ్ నెం.1,
LIC & CID ఆఫీసు ఎదురుగా, కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు.
సెల్: 9000 118811, 9966 49 71 49

## సందడిగా మారిన ఆదాల క్యాంపు కార్యాలయం



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు ఆదాల ప్రభాకర్ రెడ్డికి మంగళవారం జిల్లా వైసీపీ మహిళా నాయకురాలు కల్లూరు లక్ష్మీరెడ్డి కలిశారు. అనంతరం ఆమె అదాల ప్రభాకర్ రెడ్డిని ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు.

## జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా మొదటిసారి కాకినాడ వచ్చిన మంత్రి నారాయణ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** కాకినాడ జిల్లా టీడీపీ కార్యాలయానికి వచ్చిన మంత్రి నారాయణకు మంగళవారం కూటమి పార్టీల నేతలు ఘన స్వాగతం పలికారు. మంత్రి నారాయణకు స్వాగతం పలికిన టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు చిన రాజప్ప, ఎమ్మెల్యేలు పంతం నానాజీ, వరుపుల సత్య ప్రభ, ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్, పార్టీ ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నేతలు పాల్గొన్నారు. అనంతరం టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్య నేతలతో మంత్రి నారాయణ సమావేశమయ్యారు. జిల్లాలో పార్టీల పరిస్థితి, కూటమి పార్టీ నేతల మధ్య సమన్వయం, ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశంలో చర్చించారు. జిల్లాలో ఎన్నికల కోడ్ ఉండటంతో అధికారిక కార్యక్రమాలు కాకుండా కేవలం పార్టీ కార్యక్రమాలకే తన పర్యటన పరిమితం చేశారు.

## భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలో మంగళవారం నాగులచవితి పర్వదిన వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని వెంకట్రావుపల్లి, అప్పసముద్రం, కుర్రపల్లి బీసీ కాలనీ, గడ్డం వారిపల్లి, మిట్టపల్లి, శకునాలపల్లి, బోడబండ, కృష్ణంపల్లి, గండిపాళెం, వెంకట్రావుపల్లి, గుడినరవ, మసీదుపల్లి, ఉదయగిరి పట్టణంలోని సంతానలక్ష్మి, నగిరితోట, బిజ్జంపల్లి తదితర గ్రామాల్లో పుట్టల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాదాలు పంచిపెట్టారు. పలు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.